క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి తాగునీటిని సరఫరా చేసే మెయిన్ పైప్‌లైన్ శుక్రవారం వేంపల్లి వద్ద పగిలిపోవడంతో, శనివారం మంచిర్యాలలో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ ఇంజనీర్ మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వరకు మరమ్మతు పూర్తి చేస్తే, తాగునీటి సరఫరాను చేయడం జరుగుతుందని, లేనిపక్షంలో శనివారం తాగునీరు రాదని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ముల్కల్లలో ఉచిత వేసవి శిక్షణ కేంద్రం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉచిత వేసవి ఫిట్‌నెస్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల అనుభవం గల కమాండో శిక్షకుడు శరత్‌కుమార్ ఆధ్వర్యంలో 14సంవత్సరాలు పైబడి ఈ వేసవి ఫిట్‌నెస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల వ్యాయామాలు, రన్నింగ్, వివిధ రకాల గేమ్స్‌లతో పాటు మోటివేషన్ తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 5–30 గంటల నుంచి 7–30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ముల్కల్ల గ్రామ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9989237646 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భూకబ్జాదారులపై ఫిర్యాదు

జన్నారం: మండలానికి చెందిన సర్వే నంబర్ 361/11 లోని భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పొనకల్‌కు చెందిన కొత్త వేణుగోపాల్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, అయినా తన భూమిలో ఇతరులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కోర్టును ఆశ్రయించాలని సూచించగా, కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చానని, అయినా కబ్జాదారులు నా భూమిలో వేసుకున్న వాటిని తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎస్సై రాజవర్ధన్‌ను సంప్రదించగా ఆ భూమిపై ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 29 ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగచందర్ రావు తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఆందోళనకు గురికావద్దని, సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. సప్లమెంటరీ పరీక్ష ఫీజు చివరి గడువు మే 2 నాటికి ఉందని తెలిపారు. డీఐఈవో ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్ఐకి సన్మానం



ఆర్ఐని సన్మానిస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌కు చెందిన ఆర్ఐ ఏ.గోపిని శుక్రవారం బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాష చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఆర్ఐ గోపి తల్లి కళావతి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య పరీక్షల్లో భాగంగా కాలేయం అత్యవసరం కావడంతో తన తల్లి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చి తన శరీరంలోని కాలేయాన్ని దానం చేశాడు. ఈ సందర్భంగా ఆర్ఐ గోపి చేసిన గొప్ప కార్యం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ముఖ్యంగా నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు దైవంతో సమానమని, అలాంటి నేపథ్యంలో నేడు వారిని వృద్ధాశ్రమాల్లో చేర్చడం తగదన్నారు. తల్లిదండ్రులకు సేవ చేసే గుణం అందరికీ రావాలని కమాండెంట్ జమీల్‌భాషా కోరారు. కార్యక్రమంలో ఆర్ఐలు రవి, మారుతి, కుమారస్వామి, శ్రీనివాస్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులు, ఏపీవో, ఏఈ, ఈఈ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడమే లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పనిచేయాలని, పాఠశాలలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో 400పాఠశాలలకు అడ్వాన్స్ నిధులు మంజూరు చేయగా, 356పాఠశాలల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర నిర్వహణ పనుల్లో భాగంగా ప్రాథమిక, మౌలిక సదుపాయాల బలోపేతం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, మరమ్మతులు, ఇప్పటికే ఉండి పనిచేయని మూత్రశాలల పునఃరుద్ధరణ నిర్వహణ, తరగతి గదుల విద్యుదీకరణ, పాఠశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు సోలార్ ప్యానళ్ల ఏర్పాట్లు, పాఠశాల నిర్వహణ, ఏకరూప దుస్తుల తయారు, తదితర సౌకర్యాల కల్పన లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పని చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల పేరిట సంయుక్త బ్యాంక్ ఖాతా తెరిచి లావాదేవీలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పనులతో పాటు పాఠశాలల నమోదు ప్రక్రియ, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల పురోగతిపై ఫొటోలు తీసి పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రత్యేక ఆడిట్ జరిగిన సమయంలో ప్రతీ బిల్లును పరిశీలించనున్నట్లు, ఈ క్రమంలో పనులకు సంబంధించిన బిల్లులను ఖచ్చితంగా నమోదు చేయాలని, రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత మధ్యాహ్న భోజన పథకం, ఉపాధ్యాయుల హాజరు, పనితీరు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చేసిన పనుల విలువపై పన్నులు మినహా నిబంధనల మేరకు ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. పనుల సంబంధిత రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాల పరిధిలో బడి బయట పిల్లలందరినీ నమోదు చేసి, వారు తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగించాలి



బెల్లంపల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ శ్రేణులు



మంచిర్యాలటౌన్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ఇందుకు కార్మికులు మేడే స్ఫూర్తితో పోరాటాలను తీవ్రతరం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సింగరేణి సివిల్‌విభాగం కార్యాలయం ఆవరణలో శుక్రవారం మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలు కార్మిక వర్గానికి తీవ్ర విఘాతంగా మారుతున్నాయని విమర్శించారు. కార్మిక వర్గ ప్రయోజనాలను దెబ్బ తీసే చర్యలకు కేంద్రం పాల్పడుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో దేశంలో ఉన్న అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలు మూసివేతకు గురయ్యాయని, ప్రైవేట్ రంగానికి ఊతమిచ్చి ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. పరిశ్రమల మూతతో కార్మికులు బజారునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టీకరణను పెంచి పోషిస్తున్నారని తెలిపారు. చికాగో అమరుల నెత్తుటి సాక్షిగా పోరాటాలతోనే పాలక ప్రభుత్వాల విధానాలను ఎండగట్టాలని అన్నారు. బానిస సంకెళ్లు తప్పా పోరాడితే పోయేదేమీ లేదని విమర్శించారు. సంఘటిత ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్మికులు చిందించిన రక్తంతో ఎర్రజెండాను ఎగురవేసి అమరులకు విప్లవ జోహార్లు అర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు శ్యామ్, కృష్ణవేణి, వెంకటి, లత, వరుణ్, రాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ విడుదల

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ ఆవరణలో శుక్రవారం అంబేద్కర్ మున్సిపాల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు రామగిరి బానేశ్ ఆధ్వర్యంలో కార్మికులు మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బానేశ్ మాట్లాడుతూ.. కార్మికులంతా ఏకమై మేడేను ఘనంగా జరుపుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా కార్మికులకు రూ. 25వేల వేతనం ప్రకటించాలని, ఇందుకోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చిప్పకుర్తి నర్సయ్య, రేగుంట వెంకటి, మాదుగుల నవీన్, మల్లేశ్, సత్తయ్య, కోకిల నది, రత్నం, సుమన్, అశోక్, శ్రీనివాస్, పుష్ప పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

- రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి : అదనపు కలెక్టర్
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రైసుమిల్లుల యజమానులకు సూచన



తూకం వేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ శుక్రవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన వరిధాన్యం వివరాలు తెలుసుకున్నారు. బస్తా ధాన్యం 42.200 కిలోలు చొప్పున తూకం వేస్తున్నారని, దాని వల్ల నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆరోపించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ.. బస్తాకు 41కిలోలు ధాన్యం మాత్రమే తూకం వేయాలని, ఎక్కువ తూకం వేస్తే రైతులు నష్టపోతారన్నారు. మిల్లర్లుకు కూడా ఈ విషయం తెలియజేస్తానని, రైతులు నష్టపోకుండా చూడాలని కేంద్రం నిర్వాహకులకు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం దించుకోవాలి

జైపూర్: రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా వచ్చిన ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తెలిపారు. మండలంలోని ముదిగుంట రైస్ మిల్లులను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యానికి అనుగుణంగా బియ్యాన్ని అందించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిబంధనలకు లోబడి సకాలంలో సీఎంఆర్ అందించే విధంగా చూడాలని తెలిపారు. నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు.

ప్రతి ఓటరుకూ స్లిప్ అందించాలి



ముల్కల్లలో ఓటరు స్లిప్పుల పంపిణీలో ఆర్డీవో



తాండూర్: ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్న డీటీ ప్రసాద్



దండేపల్లి: సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గ్రామ పంచాయతీల్లో మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు తమ ఓటు హక్కు వినియోగించునేలా అవసరమైన ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీవో రాములు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ముల్కల్ల గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఓటరు స్లిప్పుల పంపిణీ చేపడుతుండగా ఆర్డీఓ స్వయంగా ఇంటింటికీ వెళ్లి మరీ ఓటర్లకు స్లిప్పులు అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని పోలింగ్ శాతం పెరగడంలో సహకరించాలని సూచించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాల్లో తహసీల్దార్ సతీశ్ కుమార్, నాయబ్ తహసీల్దార్ హరిత, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ శ్రీహరి, కార్యదర్శులు, కారోబార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని, బీఎల్వోలు ప్రతి ఓటరకు ఓటర్ స్లిప్ అందించాలని తహసీల్దార్ సంధ్యారాణి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం వారికి పంపిణీ చేయాల్సిన ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు. ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని తాండూర్, కిష్టంపేట పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు శుక్రవారం ఓటర్ స్లిప్పుల పంపిణీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్ 128, 129పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు స్లిప్పులు అందజేశారు. 37పోలింగ్ కేంద్రాల్లో 27209 మంది ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. నూతన పోలింగ్‌కేంద్రాల వద్ద ఓటును వినియోగించుకోవాల్సిందిగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికా రులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన కాంగ్రెస్ వర్గపోరు



వాగ్వివాదం చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



కాన్వాయ్ అడ్డుకుని ఆందోళన చేస్తున్న నాయకులు

- వలసదారుల ఆధిపత్యంపై అసంతృప్తి
- బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవద్దంటూ కార్యకర్తల ఆందోళన
- కాంగ్రెస్ ప్రచారంలో గందరగోళ పరిస్థితి

తాండూర్: మండలంలో కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పొడసూపాయి. శుక్రవారం అవి కాస్త తారాస్థాయికి చేరాయి. పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్వహించిన ప్రచారంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మోటార్ బైక్ ర్యాలీ తాండూర్ మండల కేంద్రానికి చేరుకున్న సమయంలో కిష్టంపేట గ్రామ పంచాయతీకి చెందిన నాయకులతో పాటు, పలువురు సీనియర్లు తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. వలసదారులకే అధిక ప్రాధాన్యమిస్తూ సీనియర్లను పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రచారం నుంచి వెళ్లిపోయారు. తాండూర్ గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజీ మహేందర్ రావు, ఆయన అనుచరులతో పెద్ద ఎత్తున పార్టీలో చేరుతారని ప్రచారం జరిగింది. ఈ సమమయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ కాన్వాయ్ మహేందర్ రావు ఇంటి వద్దకు చేరుకోగానే, అక్కడ ఆపకుండా వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు కొందరు పార్టీలోకి చేరికలు చేపట్టాలని కాన్వాయ్‌కి అడ్డు నిలిచారు. మరి కొంతమంది నాయకులు అడ్డుకుని ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపిస్తామని, ఎవరినీ పార్టీలోకి చేర్చుకోవద్దని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, గడ్డం వంశీకృష్ణలు కాన్వాయ్ నుంచి కిందకి దిగి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ రోజు చేరికల కార్యక్రమం చేపట్టలేదని, రెండు రోజుల్లో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షి బెల్లంపల్లికి వస్తున్నారని వారి సమక్షంలో చేరికలు చేపడతామని చెప్పడంతో వివాదం సద్దుమనిగింది. ఆ తరువాత బోయపల్లి బోర్డు సమీపంలోని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు నివాసం వద్దకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు చేరుకున్నారు. అక్కడ పలువురు నాయకులకు, కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే, ఇతర సీనియర్ నాయకులు కాసిపేట మండలంలో ప్రచారానికి అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా కార్యకర్తల గలాట కొనసాగింది. సీనియర్ నాయకుల బుజ్జగింపులతో వివాదం సద్దుమణిగింది. ఏది ఏమైనా ఎన్నికల వేళ కాంగ్రెస్ వర్గ పోరు రోడ్డెక్కడంతో కిందిస్థాయి కార్యకర్తలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా వెంకట్ నర్సయ్య



మంచిర్యాలక్రైం: మంచిర్యాల మహిళా పోలీసుస్టేషన్ సీఐగా ఎం.వెంకట్ నర్సయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీజోన్ 1 ఐజీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న 1996 బ్యాచ్‌కు చెందిన వెంకట్ నర్సయ్యను నియమిస్తూ ఐజీ రంగనాథ్ ఉత్తర్వుల మేరకు ఆయన విధుల్లో చేరారు.

రక్త కణాలు దానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన బక్క భీమయ్య అనారోగ్యంతో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరగా, రక్తకణాలు తగ్గి ప్రాణాపాయ స్థితిలో ఉండగా, క్యాతన్‌పల్లికి చెందిన కుమార్ తక్షణమే స్పందించి ఓ పాజిటివ్ రక్త కణాలను శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అందించారు. ఈ సందర్భంగా రక్తకణాల దాతను బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి వి.మధుసూదన్ రెడ్డి అభినందించి, ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రక్తనిధి కేంద్ర సూపర్‌వైజర్ కే.మాధవి, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీ స్టాప్ వద్ద 15 రోజులుగా నారీ సేన గ్లోబల్ ఉమెన్ ఫోరం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా శుక్రవారం నారీసేన లీగల్ అడ్వైజర్ పేరం అలేఖ్య, నటేశ్వర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండవరపు జగన్, సుంకర భుజంగరావు, కొట్టె నటేశ్వర్, గడ్డం చాణక్య, రవీందర్, నారీసేన ప్రెసిడెంట్ బొప్పులత, చార్టర్ ప్రెసిడెంట్ శివకీర్తి, సభ్యులు రేణుక, భారతి పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న దివాకర్‌రావు, కార్యకర్తలు

దండేపల్లి: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని ధర్మరావ్‌పేట, పెద్దపేట, గుడిరేవు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ఓటర్లను కలిశారు. ఉపాధిహామీ పని ప్రదేశాల వద్దకు వెళ్లి కూలీలను కలిసి కారుగుర్తుకు ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమాల్లో వైస్‌ఎంపీపీ అనిల్, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలో పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, సుధాకర్, సాధనబోయిన కృష్ణ, పెండ్యాల లక్ష్మణ్, ఆరీఫ్, సురేశ్‌రెడ్డి, అయుబ్, మహేందర్, వెంకటరాజం, భారతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం




కాంగ్రెస్ గ్యారంటీ పత్రాలతో నాయకులు

జన్నారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను, కాంగ్రెస్ కేంద్ర కమిటీ మేనిఫెస్టో గురించి వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా, ఎంపీటీసీ రియాజోద్దీన్, నాయకులు ఇందయ్య, రమేశ్, పద్మారావు, షాదు పాష, రియాసత్ అలీ, రాజేశ్, తిరుపతినాయక్, రఫీఉల్లా, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కోటపల్లి: మండల బీజేపీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఒక ప్రకటనలోతెలిపారు. మండల అధ్యక్షుడిగా మంత్రి రామయ్య, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్, రాజేశ్, సంపత్, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్, రాజేందర్, లచ్చన్న, కార్యదర్శులుగా రాజాబాబు, సుమన్, జయకర్, కోశాధికారి రాకేశ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్యాంసుందర్, మహిళా మోర్చా అధ్యక్షుడు సంగీత, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సుధాకర్, బీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎస్టీ మోర్చాఅధ్యక్షుడు మహేశ్, యువ మోర్చా అధ్యక్షుడు రమేశ్, సోషల్‌మీడియా కన్వీనర్ నర్సింహులు, కో కన్వీనర్ శ్రావన్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు.

28న ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం



ఆర్‌కే 7 గనిపై మాట్లాడుతున్న వీరభద్రయ్య

నస్పూర్: ఈ నెల 28 ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే.బాజీసైదా కోరారు. ఆర్‌కే–7 గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ మే డే పురస్కరించుకుని ఈనెల 28న పట్టణ పరిధిలోని మనోరంజన్ సముదాయంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసఫ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ హాజరవుతారని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు మురళిచౌదరి, రవీందర్, నర్సింగరావు, రాజయ్య, సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్సై

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్‌కుమార్ బాధితుడు పోగొట్టుకున్న మొబైల్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తాండూర్ మండలం తంగళ్లపల్లికి చెందిన రాదండి రమేష్ ఈ నెల 5న సాంసాంగ్ మొబైల్ పోగొట్టుకొని ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆపరేటర్ రాజేందర్ మొబైల్‌ను కనుగొని సంబంధిత వ్యక్తికి అందించినట్లు తెలిపారు.